# ఊరు ప్రయాణం

- దోరవేటి

నాన్న ఇంక ఒప్పుకోరని తేలిపోయింది. అయినా ఎన్నిసార్లడగాలి?

అమ్మ నాన్నకి చెప్పి ఒప్పించొచ్చుగా. ఊహూ! ఇలాంటి వాటిలో తల దూర్చదు. తనకేమైనా లాభం కలిగే పనులుంటే చెప్పకుండానే దూసుకొచ్చేస్తుంది.

అయినా నేనేం చిన్నపిల్లనా? పదో తరగతికొచ్చేసాను. నాకూ మంచీ చెడూ తెలుస్తాయి. ఈ పల్లెటూళ్ళో విసుగొచ్చేసింది.

నాన్నమ్మ మందలింపులు, అమ్మ అరుపులు, చెరువు నుండి నీళ్ళు తెచ్చుకోవడాలు, రేడియోలో అరిగిపోయిన రికార్డులు, ఏట్లో జలకాలు, ఇంట్లో విస్తళ్ళు కుట్టుకోవడాలు, కరెంటు పోతే ఆ ఆకుల్నే విసనకర్రలు చేసుకుని ఊపుకోవడాలు... ఛ! ఈ ఇంట్లో ఓ టీవీ అయినా ఏడ్చి చచ్చిందికాదు.

దాంతో భలే కాలక్షేపంగా ఉండేది. బోల్డు సినిమా కబుర్లు, సీరియల్స్, సినిమాలు... ఊహూ మా ఊళ్ళో నాలుగే టీవీలు. అందులో మాకు తెలిసింది ఒక్కటే. ఆ ప్రసన్న వాళ్ళది.

దానికెంత టెక్కో. నోరు తెరిస్తే అన్నీ టీవీ కబుర్లే. అసలు దాని నోరే ఓ టీవీ స్క్రీను. కాకపోతే ఆ మాటలే బొమ్మలకంటే పెద్దగా వుంటాయి. పేద్ద తమకొక్కరికే వున్నట్లు బోడి టీవీ. పోయిన సంక్రాంతికి దాని పొగరు అణిగిందనుకున్నా.

నాన్న టీవీ తెచ్చినంత పని చేసారు. అంతలోనే ఏమయిందో! 'బంగారూ! ఈసారికి కాదుగానీ వచ్చే దసరాకి తప్పక కొనేద్దాం' అనేసారు. అంతరాయానికి చింతిస్తున్నామని రేడియోలో చెప్పినంత తేలిగ్గా. నాకైతే ఏడుపొచ్చేసింది. నాన్న ఎలాగూ టీవీ తెస్తారని ప్రసన్నతో గొడవ పెట్టుకుని దాని దోస్తీ కచ్చీ చేసేసానుకదా.

నేనే దాని దృష్టిలో మరింత చులకనైపోయాను. ఎంత అవమానంగా అనిపించిందో! చదువులో ముందుండబట్టి సరిపోయింది. లేకుంటే అది నన్ను ఆడించేదే! సెలవుల్లోనైనా హాయిగా హైదరాబాద్‌లో గడిపి, దానికి తెలీని బోలెడు సంగతులు ఫ్రెండ్స్‌తో చెప్పి దాన్ని చిన్నబుచ్చుకునేలా చేయాలనుకుంటే "నువ్వక్కడుండలేవమ్మా. మళ్లీ నాలుగు రోజులకే వెనక్కి పంపాలంటే బాబాయికి కుదరదు. నాకు పనులు తెమలవు. కాస్తాగు" అంటూ అడిగినప్పుడల్లా ఒకటే సమాధానం టీవీలో యాంకర్‌లాగా. అయినా వాళ్ళు పరాయివాళ్లా? నాన్నగారి తమ్ముడేనాయె. సంక్రాంతికి వచ్చినప్పుడు మరీ మరీ చెప్పారుకూడా. "శ్రావణిని తప్పకుండా పంపండి పరీక్షలు కాగానే" అని. అప్పుడైతే సరేనన్నారు. కానీ పరీక్షలైపోయినప్పటి నుండీ అడుగుతూనే వున్నాను. షరా మామూలుగానే నాన్న దాటేస్తూ ఉన్నారు.

చూస్తుండగానే సెలవులు కరిగిపోతున్నాయి. నామీద నాకు కసి, నాన్నమీద కోపం పెరిగిపోతున్నాయి. నాన్నమ్మకూడా అత్తయ్య వాళ్లింట్లో పెళ్లికని వెళ్లి నాలుగురోజులయింది. ఈ తమ్ముడు వెధవ వున్నా లేకున్నా ఒకటే. వాడో అమ్మ కూచి. రెండ్రోజులుగా పరమ బోర్‌గా వుంది. ఆ రేడియో పాటలు కూడా ఎవరన్నా పోతే వినిపించే ఏడుపు సంగీతంలా వుంది. అన్నం సయించడంలేదు. అప్పుడప్పుడు దుఃఖం తన్నుకొస్తుంది. ఉదయం నుంచీ అమ్మ ఎంత బలవంతం చేసినా తినలేదు. మధ్యాహ్నానికి పట్టుదల మరింత పెరిగింది. కోపంతో అమ్మ ఓ దెబ్బవేసి పట్టు మరింత బిగుసుకునేలా చేసింది. కడుపులో మెలిపెడుతోంది. అది ఆకలి వల్లో... బాధ చేతో!

★★★

"బంగారూ...బంగారూ!"

నాన్న పిలుపుతో ఉలిక్కిపడి లేచాను. కళ్ళు నులుముకుని చూసాను. రాత్రయినట్టుంది.

"అన్నం మీద కోపగించుకుంటావట్రా! నా తల్లివి కదూ. మొహం కడుక్కో తిందాం"

అప్పుడు గుర్తుకొచ్చింది మధ్యాహ్నమనగా అలిగి పడుకున్నానన్న సంగతి. నాన్న పలకరింపు దుఃఖాన్ని కెలికినట్టయింది. మొహం మోకాళ్ల మధ్య దాచుకున్నాను.

"హైదరాబాద్ పంపలేదనేగా? సరే పంపిస్తాను. రేపే. లేలే..." నా భుజం మీద చేయివేసి లాలనగా అన్నారు నాన్న.

చివ్వున తలెత్తి చూసాను. నీటి పొరల్ని చీల్చుకుంటూ నమ్మలేనట్లు. నాన్న సాధారణంగా అబద్ధం చెప్పరు.

"నవ్వాలి మరి" నా కళ్లల్లోకి చూసారు.

నా మొహంలో నవ్వు నాన్న కళ్లల్లో కన్నీళ్లై ప్రతిఫలించింది. ఎందుకో నేనేడిస్తే చూళ్ళేరు. నాన్న బాధ చూడడం నాకూ ఇష్టముండదు.

తరువాత తెలిసింది రోజంతా ఎక్కడెక్కడో తిరిగి డబ్బు అప్పు తెచ్చారట నన్ను హైదరాబాద్ పంపేందుకు.

★★★

ఒక్కోసారి మన అనుభూతిని చెప్పడం కష్టం. ప్రస్తుతం నేనెంత ఆనందంగా వున్నానో చెప్పలేనట్లు. కలలన్నీ కల్లలేనని నిరాశలో కూరుకుపోతున్నప్పుడు అనుకున్నవన్నీ లభిస్తే ఎలా వుంటుంది? అదే ఇది. నేను హైదరాబాద్ వచ్చేసాను. అదీ సంగతి.


కానీ నేను ఇక్కడికి రావడానికి నాన్న ఎంత కష్టపడ్డారో తెలిసినప్పుడు బాధపడ్డాను. మా ప్రయాణానికయ్యే ఖర్చే కాకుండా మరో వెయ్యి రూపాయలు బాబాయికి ఇవ్వడం నేను చూసాను 'ఖర్చులకోసం' అంటూ.

మేమిప్పుడున్న పరిస్థితుల్లో నాన్నకి ఇంత ఖర్చు భారమే.

అవే డబ్బులుంటే తమ్ముడికీ నాకూ యూనిఫామ్‌లకూ, నోట్సుకీ సరిపోయేవి. కానీ ఏం చేస్తాం? మా హిందీ టీచర్ చెప్పినట్లు కొన్ని కావాలనుకుంటే మరికొన్ని వదులుకోక తప్పదేమో!

చూడ్డానికి మా బాబాయ్ వాళ్లుండేది నాలుగంతస్థుల పెద్ద భవనం. అందులో వాళ్లకు సొంతమైంది మాత్రం రెండు బెడ్రూముల ఫ్లాటు. అది మా వసారాకంటే కొంచెం ఎక్కువ. వీధి వాకిలికంటే తక్కువ. అయినా బొమ్మరిల్లులా చక్కగా సర్దిపెట్టుకున్నందు వల్లనేమో ముచ్చటగా, సౌకర్యంగా వుంది.

నన్ను వదిలేసి వెంటనే నాన్న వెళ్లారు. రోజంతా హాయిగా గడిచిపోయింది. బాబాయి కూతురు శృతి తను గీసిన బొమ్మల పుస్తకం చూపించింది. అది నాకంటే ఒక తరగతి తక్కువే. ఎంత బాగా గీసిందో. అయినా కళకు వయసుతో, చదువుతో సంబంధం



టుంది. మా తెలుగు టీచర్. బాబాయి కొడుకు రాహుల్ ఇంటర్ చదువుతున్నాడు. వాడు మధ్యాహ్నం గానీ కంట పళ్లేదు. క్రికెట్ కోచింగ్‌కి వెళ్ళున్నాడట.


అన్నిటికంటే నన్ను బాగా ఆకట్టుకుంది రంగుల టీవీ. అది చూడగానే పొగరుబోతు ప్రసన్న గుర్తుకొచ్చింది. దాన్ని లాక్కొచ్చి 'బోడి మీ టీవీ బ్లాక్ అండ్ వైట్. పైగా అందులో ముష్టి మూడు ఛాన్సల్సేగా వస్తాయి. టక్కూ టక్కూ అంటూ తిప్పే ఛానల్స్ ట్యూనర్ వారానికొక్కటి మారుస్తుంటావు. మా హైదరాబాద్‌లో చూడు ఎంత పెద్ద టీవీ వుందో. పైగా రంగుల్ది. మీ టీవీలా బొమ్మేస్తే సౌండు రాదు. సౌండ్ వినిపిస్తే బొమ్మ కానరాదు సిస్టంకాదు. సినిమా బొమ్మంత అందంగా కనిపిస్తుంది. వినిపిస్తుంది. కూచున్న చోటునుండి కదలకుండా వంద ఛానళ్ళు చూపిస్తుంది. చూడవే చూడు!' అంటూ కూలేసి స్పోషల్ మేష్టారులా ఓ పెద్ద క్లాసు పీకాలనుకున్నా.

లేదం

కానీ ఇక్కడ కూడా ఓ చిన్న అపశృతి. పిన్నికీ, శృతికీ తగాదా. ఆవిడేమో డెయిలీ సీరియల్స్ చూస్తానంటుంది. అదేమో కార్టూన్ నెట్‌వర్క్, పోగో ఛానల్స్ మార్చి మార్చి చూస్తుంది. ఒకరికి తెలియకుండా మరొకరు రిమోట్ దొరకబుచ్చుకుని ఛానల్స్ మార్చడం తమాషాగానే అనిపించినా ఒక్కోసారి రెచ్చిపోయి కేకలేసుకోవడం, అలగడం చూస్తుంటే ఆశ్చర్యంగానే కాదు, ఇబ్బందిగానూ అనిపిస్తుంది. వీళ్ల యుద్ధానికి చివరికి రాహుల్ తెర దించాడు.

సాయంత్రం వచ్చీ రాగానే ఏదో క్రికెట్ మ్యాచ్ ట్యూన్ చేసుకుని వాళ్లిద్దర్నీ మాట్లాడనీయకుండా చేసి వాడందులో లీనమైపోయాడు. అయినా శృతి మధ్యమధ్యలో ఛానల్ మార్పుకోసం పోరాడుతూనే వుంది.

మా ఊరొచ్చినప్పుడు రాహుల్ బోలెడు కబుర్లు చెప్పేవాడు. వాడితో మాట్లాడుతుంటే చాలా సరదాగా వుండేది. ఆ కబుర్లన్నీ క్లాసులో వారం రోజులదాకా ఊరించీ ఊరించీ చెప్పింది ప్రసన్న అసూయపడేలా. ఇక్కడికొస్తే వాడ్నడిగి ఎన్నో తెలుసుకోవాలనుకుంది. పైగా మరచిపోతానేమోనని డౌట్స్ అన్నీ లిస్టు రాసుకుని వచ్చింది. కానీ ఇక్కడికొచ్చాక స్విచ్ నొక్కగానే వెలిగి ఆరిపోయిన బల్బులాగా నేను కనిపించగానే ఒక్కసారిగా తన ఆనందం ప్రకటించేసి తరువాత నా ఉనికే పట్టనట్టు వ్యవహరిస్తున్నాడు. చాలా బాధగా వుంది. వాడి



## కొత్త రూపం

తారలు పరిస్థితులకి అనుగుణంగా తమ పాత్రల్ని మార్చేసుకుంటుంటారు. ఇప్పుడు ఈషా డియోల్ కొత్త రూపంతో అందర్నీ ఆకట్టుకోవడానికి ముందుకొచ్చింది. దక్షిణాదిలో తనకు వరుస ఆఫర్లు వస్తున్నాయని చెప్పే ఈషా తల్లిలాగే అన్నిరకాల పాత్రలు చేసి చిరకాలం పాటు అందరి మనసుల్ని రంజింపచేయాలనుకుంటోంది. మాధవన్‌తో కలిసి ఆమె ఓ తమిళ చిత్రంలో నటిస్తోంది. బాలీవుడ్‌లో లాగే దక్షిణాదిన కూడా ఓ వెలుగు వెలగగలనన్న ధీమాతో ఉంది ఈషా.

పద్ధతి బాగా నిరుత్సాహపరిచింది.

నాకు మిగిలిన తోడు శృతి ఒక్కటే. అది కూడా టీవీకి ఎదురుగా కూర్చుని చెస్ ఆడింది. క్యారమ్సూ అలాగే. గెలుపోటముల గురించి ఆటలో పట్టించుకోనేలేదు. అసలు గెలవాలనే తపనే లేదు దానికి. అది లేనప్పుడు ఆటలో మజా ఏముంటుంది? ముందర సజీవంగా నేనున్నా టీవీలోని ప్రాణం లేని బొమ్మల సీరియల్ గురించే దాని చర్చలూ, ఆరాటమూనూ. అది మా పెరటి జామ చెట్టు గురించీ, కొత్త మామిడికాయల గురించి, మా పొలంగట్టునున్న చింత చెట్టు చిగురు గురించీ, మా కుక్కపిల్లల గురించి, సెలయేట్లో మేం పటుకున్న చిన్న చిన్న రంగుల చేపల గురించి అడుగుతుందనుకున్నా. ఒక్కటైనా అడగలేదు. అడగందే నేను మాత్రం ఎందుకు చెప్పాలి?


సాయంత్రం రాహుల్ పుణ్యమా అని టీవీ రిమోట్ దాని చేతుల్లోంచి పోయింది. కానీ విచిత్రంగా అంతసేపు సిస్టమాటిక్‌గా పనులుచేస్తున్న దాని ప్రవర్తనలో ఏదో మార్పొచ్చింది. రిథమ్ కోల్పోయిన పాటలా వుంది దాని పరిస్థితి.

అలవాటు లేకపోవడంవల్లనేమో అగ్గిపెట్టెలాంటి ఆ ఇంట్లో విడిచిన గాలే మళ్లీ మళ్లీ పీల్చుండంటూ సణిగే ఫ్యాన్ బాధలో నుండి కాసేపు బయటపడితే బాగుండుననిపించింది. అదే అన్నాను శృతితో. అది వెంటనే ఒప్పుకుంది ఆశ్చర్యంగా.

బాల్కనీలోకొచ్చి చూసాం. బయటెక్కడా ఆడుకునేంత స్థలంలేదు. అబ్బాయిలు రోడ్డుమీదే క్రికెట్ ఆడుతున్నారు. వచ్చిపోయే మనుషులూ, వాహనాలూ పట్టించుకోకుండా. మూడో అంతస్థు మాది. నేనాలోంచి చెప్పాను తొక్కుడుబిళ్ళ ఆడుకుందామని. దానికి తెలియకపోతే ఆటంతా నేనే చెప్పాను. మా ఫ్లాట్ ముందు, నాలుగు ఫ్లాట్ల మధ్యగల ఖాళీ స్థలంలో రింగులు గీసాను. ఆట మొదలైంది.

"ప్రెసిడెంట్...ప్రెసిడెంట్..." అని అరుస్తూ ఇంట్లోకి పరుగెత్తింది సడెన్‌గా శృతి.

నాకర్థంకాలేదు. ప్రెసిడెంట్ ఎవరు? అబ్దుల్ కలామ్ కాదుకదా. ఆయనిక్కడికి ఎందుకొస్తాడు? వచ్చినా భయమెందుకు?




నా సందేహాలింకా తీరలేదు. నల్లగా నిగనిగలాడుతున్న ఓ ఆరడుగుల మనిషి అక్కడ ప్రత్యక్షమయ్యాడు.

"ఎవర్నువ్వు?" గద్దించాడు.

అర్థంలేని అతని అరుపులకు భయపడలేదు నేను. పైగా అడిగిన వాటికన్నింటికీ తొణక్కుండా సమాధానాలిచ్చాను. నన్నేమీ అనలేక పిన్నిని పిలిచి ఏదో వార్నింగిచ్చి వెళ్లాడు.

అతను ఆ అపార్ట్‌మెంట్ బోర్డు ప్రెసిడెంటట. పిల్లలంతా అతడ్ని చూస్తేనే హడిలి ఛస్తారట. అక్కడ ఆడుకోవడం కాదుకదా గట్టిగా మాట్లాడినా తప్పేనట. అతనితో నేను మాట్లాడిన తీరుకు పిన్ని నన్ను అభినందించి ఆశ్చర్యంలో మునిగిపోయింది పనిలో పనిగా.

రాత్రి ఏడింటికి బాబాయ్ వచ్చాడు. మాట వరసకి ఏదో రెండు మాటలు మాట్లాడాడు నాతో. తరువాత టీవీలో మునిగిపోయారు. అక్కడా దెబ్బలాటే. ఇప్పుడు ప్రత్యర్థులు మారారు. ఓ ప్రక్క పిన్ని సీరియల్స్‌కోసం, మరోపక్క రాహుల్ క్రికెట్ కోసం. ఆ సంగ్రామం అలా సాగుతుండగానే అరుస్తూ, గ్లాసు లెత్తేస్తూ, పదార్థాలను విసుక్కుంటూ ఒకరినొకరు విమర్శించుకుంటూ భోజనాలు అయ్యాయనిపించారు. అందులో నేనూ ఉన్నాను (తినడంలో)

రాత్రి పడుకునేటప్పుడు కొత్త సమస్య వచ్చి పడింది. ఒక బెడ్రూంలో పిన్ని, బాబాయ్ పడుకుంటారు. మరో బెడ్రూంలో శృతి, రాహుల్. శృతివాళ్ళు పడుకునే బెడ్రూం చిన్నది. ఆ బెడ్‌మీద ఇద్దరికంటే పడుకోవడం కష్టం. అదీ ఎండాకాలం. ఇంకొకరు పడుకోవాలంటే నేలమీదే.

తర్జనభర్జనల తరువాత రాహుల్ హాల్లో పడుకోవాలని నిర్ణయించారు. కానీ ఒక్కడికోసం ఓ ఫ్యాన్ తిరగడం బాబాయికి నచ్చలేదు. బెడ్రూం వదిలి హాల్లో సోఫాలో పడుకోవడం రాహుల్‌కి ఇష్టంలేదు. తన కొడుకు బాధపడడం పిన్నికి నచ్చలేదు. ఎవరే మనలేదు.

కానీ 'ఎన్నాళ్లీ శిక్ష?' అన్నాడు రాహుల్ మొహమాటమైనా లేకుండా.

నాకు బాధేసింది. మా ఊరొచ్చినప్పుడు అందర్నీ బలవంతం మీద వారంరోజులు సంతోషంగా ఉంచుకున్నాం.

కానీ ఇక్కడ నేనొక్కదాన్నీ ఒక్కరోజైనా గడవక ముందే వాడెంత మాట అనేసాడు? ఈ స్వేచ్ఛ కోసమేనా అమ్మానాన్నల్ని బాధపెట్టి నేనింత దూరం వచ్చింది?

మూడురోజులకే ఎన్నోరోజులు గడిచినట్లు, ఇంకెంతో కాలం ఇక్కడ ఉండాలేనన్నట్లు భారంగా అనిపించసాగింది. మా ఊరికి వచ్చినవాళ్లు, వీళ్లూ ఒక్కటే కాదనిపించింది.

వీళ్లకిక్కడ టీవీ అనే సొంత ప్రపంచం ఒకటుంది. దేన్ని చూసినా, ఏది విన్నా, ఏ రుచి చూసినా టీవీయే మాధ్యమం. అదే నేపథ్యం. అదే ఉపమానం. అదే పాత్ర, అదే పదార్థమమునూ. మిగతా బంధాలు, బాధ్యతలన్నీ దాని తరువాతే. దాన్ని తోసిరాజని బతుకు భయమో, అయిష్టమో చెప్పడం కష్టం. చివరకు ఇరుగుపొరుగులతో మాట్లాడినా, ఫోన్‌లు ఎంగేజ్ చేసినా అన్నిటికీ అదే

ప్రధానాంశం.

★★★

ఆ రోజు ఆదివారం. పదిగంటలకి అంతా టిఫిన్ చేస్తూ టీవీ చూస్తున్నాం. కాదు టీవీ చూస్తూ టిఫిన్ చేస్తున్నాం. సడెన్‌గా డోర్ బెల్ మోగింది. బాబాయ్ వెళ్లి తలుపు తీసాడు. నా దృష్టి అటు మళ్లింది.

"పక్క ఫ్లాట్లో రాజమల్లు వాళ్లబ్బాయి రోడ్ యాక్సిడెంట్‌లో చనిపోయాడు. ఇప్పుడే డెడ్‌బాడీ తెచ్చారు''

ఆపై వినలేకపోయాను. కళ్ళు బైర్లు కమ్ముతున్నట్లు, వాంతి వస్తున్నట్లు అనిపించింది. యాక్సిడెంట్, చావు, ఏవేవో మిధ్యా దృశ్యాలు మెదడును కకావికలం చేయసాగాయి. గబుక్కున లేచి ప్లేటు సింకులో పడేసాను.

"అదేంటే బంగారంలాంటి పెసరట్టు...'' పిన్ని కేకల్ని పట్టించుకునే స్థితిలోలేను.

అంతకంటే ఆశ్చర్యంగా వాళ్ళా వార్తను టీవీలో ఓ యాడ్ చూస్తున్నంత ఈజీగా రిసీవ్ చేసుకుని తింటూనే అతడ్ని గురించి చర్చించుకుంటున్నారు. ఫలానా, ఫలానా ఆనవాళ్ళు చెప్పుకుంటూ చచ్చిన వాడ్ని గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు.

మా ఊళ్ళో అయితే కాలం తీరిన ముసలాళ్ళు పోయినా ఊరంతా ఒక్కటై తమ సానుభూతి తెలియజేస్తారు. ఒకే ఇంట్లో ఉండే మనిషి అర్ధాయుష్కుడై దారుణంగా చనిపోతే చలించని వాళ్ళు యంత్రాలకంటే హీనంకదూ!

నిజమే పట్టణాల్లో ప్రజాజీవనం యాంత్రికమే. అర్థంలేని ఉరుకులు, పరుగుల మధ్య ఆపసోపాలు పడుతూ కాలంతో పోటీపడుతూ నిజమైన యంత్రాల్లా సాగే వీళ్ళ బ్రతుకుల్లో మిగిలే కాలం అత్యల్పం. అందులోని అత్యధికం టీవీ చూస్తుంటే పట్టించుకోవడం మానేసి వీళ్ళే స్వయంగా నైవేధ్యం పెడుతున్నారు. ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు.

ఇంటికి ఓ వార్తాపత్రిక వస్తుంది. వారంవారం ఓ మ్యాగజైన్ వస్తుంది. దాన్ని ఎవ్వరూ పూర్తిగా పట్టించుకునే పాపాన పోరు. వెగటుగావున్నా ఓ నిజం చెప్పాడు రాహుల్. పేపర్ వేయించుకోవడం కూడా స్టేటస్ సింబలట.

నిన్న మరో దిగ్భ్రమ కలిగించే అంశం తెలిసింది. నాన్నగారికి ఉత్తరం రాసేందుకు పోస్టాఫీసు కోసం అరగంట వెతకాల్సి వచ్చింది. తీరా చూస్తే అపార్ట్‌మెంట్‌కు అది వంద గజాల దూరంలోకూడా లేదు.

ఆ సంగతి ఈ లోకాలిటీలోనే చాలామందికి తెలియదు.. అంతేకాదు, దగ్గరలోవున్న పార్కునానుకుని ఓ లైబ్రరీ వున్న సంగతి రోజూ ఆ పార్కులో జాగింగ్ చేసే పిన్ని బాబాయిలకు తెలీదు. అందుకే జర్మనీలో సంవత్సరానికి సగటున ఒక మనిషి 450 పైచిలుకు పుస్తకాలు చదివితే మన సగటు రెండు దాటలేదట. ఇది ఏ పదేళ్లక్రిందటో మాట. ఇప్పుడైతే 0.2 అన్నా ఆశ్చర్యపోనక్కర్లేదు.

పుస్తకాల సంగతి సరే. తమ చుట్టూ మనుషులున్నారనీ, వాళ్లతో మాట్లాడవచ్చుని, ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం హృదయోల్లాసాన్ని కలిగిస్తుందనీ, గ్రహించకపోగా ఎవరితో మాట్లాడితే ఏం కొంపలంటుకుంటాయోనని భయపడి ఛస్తున్నారు. రెండ్రోజుల క్రింద పక్కింటావిడతో అరగంట మాట్లాడితే నన్ను అనాగరికపు మేళం క్రింద జమ కట్టారంతా.

నిద్ర పట్టక బాత్రూంకి వెళ్లేందుకు లేచాను. హాల్లో టీవీ ఆన్‌లో వున్నట్టనిపించి అటు వెళ్లాను. ఒక్క క్షణం ఉలిక్కిపడ్డాను.

సోఫాలో బోర్లా పడుకుని ఉన్నాడు రాహుల్. అప్పుడప్పుడే నిద్రపోయినట్టున్నాడు. టీవీలో ఆన్‌లో ఉంది. అతని చేతిలో రిమోట్ జారిపోతున్నట్టుంది. స్క్రీన్ మీద... మిడ్‌నైట్...హాట్... చటుక్కున ఆఫ్ చేసాను.

ఏదైనా మనిషి చేతిలోనే వుంది. టీవీ మానవ మేధస్సు కనిపెట్టిన అద్భుతమైన ఆవిష్కరణ. ఉత్తమ వైజ్ఞానిక సాధనం. దాన్ని పరిమితంగా, సక్రమంగా వినియోగించుకోలేనప్పుడు ఫలితాలు వికృతంగానే వుంటాయి.

ఊళ్ళో మాకు ఫోన్‌లేదు. నాన్నతో మాట్లాడాలంటే తనే ఇక్కడికి ఫోన్ చేయాలి. ఇప్పుడు ఆ అవకాశం కూడా చేజారిపోయింది. టీవీలో ఏదో డయల్ ప్రోగ్రాం కోసం శృతీ, రాహుల్ కొట్టుకుని టెలిఫోన్‌ని పగులగొట్టేసారు.

ఇక్కడుండడం ఏమాత్రం నాకు నచ్చడంలేదు. నాన్న ఎప్పుడొస్తారో తెలియదు. వచ్చేదాకా ఇక్కడే ఉంటే ఖచ్చితంగా పిచ్చిదైపోతుంది. అందుకే సోమవారం ఉదయం లేవగానే బాబాయ్‌తో అన్నాను.

"బాబాయ్! నన్ను ట్రైనెక్కించేసేయ్. నేను వెళ్తాను. బోలెడు హోం వర్కుంది'' కారణంకూడా చెప్పేసాను. మరో ప్రశ్న అడగకుండా.

బాబాయ్ సరేనన్లేదు. అలాగని వారించే ప్రయత్నమూ చేయలేదు. 'హూ! టీవీ ప్రభావం! ఓ ఆలోచన చేసేందుకు, దాన్ని వెంటనే ప్రకటించేందుకు శక్తి లేకుండా చేస్తోంది మరి' అనుకుంటూనే బాబాయ్ సమాధానం కోసం చూడకుండా నా బట్టలు సర్దుకోసాగాను.

★

## పాత్ర

''రేపట్నుంచీ ఎగ్జామ్స్ పెట్టుకుని అలా టీవీ చూస్తూ కూర్చుంటావేమిటిరా? పరీక్ష లెలా రాస్తావ్?'' కోపంగా అడిగాడు తండ్రి.

''నా ముందు కూర్చుని పరీక్ష రాసేవాడితో పొత్తు పెట్టుకుంటా నాన్నా'' తాపీగా చెప్పాడు కొడుకు.

## విద్య

''మా తాతయ్యకు వయోజన విద్య నేర్పించి చాలా తప్పు చేశాం'' బాధగా చెప్పాడు సూర్యం.

''ఎందుకని?'' ఆశ్చర్యంగా అడిగాడు చంద్రం.

''చదువు నేర్చుకుని ఇప్పుడు మా పక్కింటి బామ్మగారికి ప్రేమలేఖలు రాస్తున్నాడు.''

## నిద్ర

''పగలంతా ఉద్యోగం చేసి రాత్రి మళ్లీ మన ఆఫీసులోనే నైట్ వాచ్‌మెన్‌గా ఎలా చేస్తావయ్యా'' అడిగాడు మేనేజర్ గుర్నాథం.

''పగలంతా ఆఫీస్‌లో నిద్రపోయి రాత్రిళ్ళు నిద్ర రావడంలేదు సార్. అందుకని...'' చెప్పాడు గుర్నాథం.

## ఉద్యోగం

''ఏరా ప్రసాదూ! చిన్నప్పుడు క్లాస్‌లో ఎప్పుడు చూసినా నిద్రపోయేవాడివి. ఇప్పుడేం చేస్తున్నావేంటి?'' అడిగాడు ప్రసాద్‌ని అతని చిన్నప్పటి మాస్టారు.

''మీ దయవల్ల గవర్నమెంటు ఆఫీసులో ఉద్యోగం దొరికి ఇప్పుడు కూడా రోజంతా నిద్ర పోతున్నా మాస్టారు'' చెప్పాడు ప్రసాద్.

**-కె.చంద్రకళ (చెన్నై)**

